

గప్‌చుప్.. వాట్సాప్

సచివాలయాల వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ ప్రచారం

- ప్రతి గ్రూపులోనూ 'సజ్జల ఆఫీసు వాట్సాప్' పేరుతో అడ్మిన్
- వీరంతా వైసీపీ సోషల్ మీడియాకు చెందినవారే..
- ప్రభుత్వ పథకాల ప్రచారం, ఊకదంపుడు ప్రసంగాలు
- ప్రతిపక్షాలపై నిందారోపణలు, మార్ఫింగ్ న్యూస్
- ప్రతి గ్రామం, డివిజన్‌లో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన





ప్రభుత్వ అనుకూల పోస్టులు పెడుతున్న వలంటీర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాట్సాప్ వేదికగా గ్రామ, వార్డు వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘి స్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా కనుసన్నల్లోని సచివాలయ, కమ్యూనిటీ గ్రూప్ అడ్మిన్లు అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అధికార వైసీపీ పథకాలపై ప్రచారం చేయటం, పెయిడ్ న్యూస్‌తో పాటు విపక్షాలపై విషప్రచారం, సమాజంలోని వివిధ వర్గాలను రెచ్చగొట్టేలా కథనాలు ప్రచురించడం, మార్ఫింగ్ న్యూస్ వంటి వాటికి అడ్డగోలుగా పాల్పడుతున్నారు. ఈ వాట్సాప్ గ్రూపులపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) దృష్టి సారించకపోతే ఎన్నికల స్ఫూర్తి దెబ్బతినే అవకాశముంది.

వైసీపీ అనుకూల ప్రచారం

ఆయా గ్రామాలు, డివిజన్లలోని కుటుంబాల లెక్క ప్రకారం 10 నుంచి 25 మంది వరకూ వలంటీర్లు ఉంటారు. ఈ వలంటీర్లంతా మొదట్లో తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని చేరవేయటం, దరఖాస్తులను స్వీకరించటం, ఇతర సమాచారాన్ని అందించడం కోసం వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఏడాదికి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్ల వాట్సాప్ గ్రూపులపై దృష్టిపెట్టింది. గ్రామస్థాయిలో ఊరు పేరుతో సచివాలయం అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయించింది. స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉన్న వారందరినీ ఇందులో యాడ్ చేశారు. వలంటీర్లు, వైసీపీ సోషల్ మీడియాకు చెందినవారు ఇందులో అడ్మిన్లు. ప్రతి గ్రామ సచివాలయ గ్రూపులో కూడా సజ్జల ఆఫీసు వాట్సాప్ పేరుతో ఒక అడ్మిన్ ఉంటాడు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని మండలాలు ఉంటే అన్ని మండలాలకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ గ్రూపును ఏర్పాటు చేశాక గ్రూపులోని సభ్యులందరికీ కమ్యూనిటీ మెసేజ్‌లు కూడా రావడం మొదలయ్యాయి. ఏ గ్రామంలో ఉన్నవారైనా మరో గ్రామంలోని గ్రూపులో జాయినై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవచ్చు. పోస్టింగ్‌లు చేయవచ్చు. ఇలా విస్తృత స్థాయిలో వైసీపీ సోషల్ మీడియా విభాగ వాట్సాప్ గ్రూపులు పనిచేస్తున్నాయి.

విపక్షాలపై దుష్ప్రచారం

ఈ వాట్సాప్ గ్రూపుల ద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు సబంధించిన వీడియోలు, ఫొటోలు, పోస్టర్లు, ఆడియో మెసేజ్‌లు ఇలా ప్రతిదాన్నీ పోస్టు చేస్తున్నారు. ప్రభుత్వ నవరత్నాల పథకాలను ఊదరగొడుతున్నారు. ముఖ్యమంత్రి ఫొటోలను తరచూ పోస్ట్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి డైలాగులను, లైవ్ వీడియో లింక్‌లను పోస్టు చేస్తున్నారు. వైసీపీ అనుకూల నకిలీ సర్వేలను పెడుతున్నారు. అలాగే, టీడీపీని కించపరిచే పోస్టింగులు కూడా చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును కించపరిచేలా, లోకేశ్ వ్యాఖ్యలు మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇలాంటివి ప్రచారం చేయరాదు. అయినా.. వలంటీర్లతో పాటు వైసీపీ సోషల్ మీడియా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలా దుష్ప్రచారం చేస్తోంది.

వాట్సాప్ వేదికగా గ్రామ, వార్డు వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘి స్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా కనుసన్నల్లోని సచివాలయ, కమ్యూనిటీ గ్రూప్ అడ్మిన్లు అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అధికార వైసీపీ పథకాలపై ప్రచారం చేయటం, పెయిడ్ న్యూస్‌తో పాటు విపక్షాలపై విషప్రచారం, సమాజంలోని వివిధ వర్గాలను రెచ్చగొట్టేలా కథనాలు ప్రచురించడం, మార్ఫింగ్ న్యూస్ వంటి వాటికి అడ్డగోలుగా పాల్పడుతున్నారు. ఈ వాట్సాప్ గ్రూపులపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) దృష్టి సారించకపోతే ఎన్నికల స్ఫూర్తి దెబ్బతినే అవకాశముంది.
ఆంధ్రజ్యోతి, విజయవాడ







పంచాయతీల నిధులు పక్కదారి

సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ రూపంలో పంచాయతీలకు జమ కావాల్సిన నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించింది. పంచాయతీలతోపాటు మండల పరిషత్‌లకు రావాల్సిన నిధులను విడుదల చేయకుండా జాప్యం చేస్తోంది. స్థానిక సంస్థలకు స్టాంప్‌డ్యూటీ రూపంలో ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయాలని జిల్లాలోని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రతినెలా లేదా రెండు నెలలకు ఒకసారి అయినా పంచాయతీలకు క్రమం తప్పకుండా జమ చేయాల్సిన నిధులను రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఏ కారణంతో నిలిపివేశారో స్పష్టత ఇవ్వడంలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనలతోనే స్టాంప్‌డ్యూటీ నగదు పక్కదారి పట్టిందని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఈ నిధులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాలని సర్పంచులు కోరుతున్నారు.

పంచాయతీలు, మండల పరిషత్‌లకు సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ నిధులు విడుదలలో జాప్యం

- 2022 డిసెంబరు నుంచి పెండింగ్‌లోనే
- పెద్ద పంచాయతీలకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు బకాయిలు
- జనరల్ ఫండ్ ఖాతాల్లో జమ చేయకపోవడంతో పంచాయతీల్లో నిధుల కొరత
- గగ్గోలు పెడుతున్న సర్పంచ్‌లు


బందరు మండలం చిన్నాపురం పంచాయతీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 25 మండలాలు 497 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో జరిగే భూములు, ఇళ్లస్థలాలు, గృహాలు ఇతరత్రాలు క్రయవిక్రయాల సమయంలో స్టాంప్‌డ్యూటీని రిజిస్ట్రార్ కార్యాయాల్లో వసూలు చేస్తారు. స్టాంప్‌డ్యూటీగా వసూలు చేసిన ఈ మొత్తంలో నుంచి మండల పరిషత్‌లకు 5 శాతం, పంచాయతీలకు 5 శాతం వాటా చొప్పున సర్‌చార్జి స్టాంప్‌డ్యూటీగా విడుదల చేయాల్సి ఉంది. గతంలో నెలకోసారి లేదా రెండు నెలలకు ఒకసారి ఈ నిధులను రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు ట్రెజరీల ద్వారా పంచాయతీలు, మండల పరిషత్‌లకు జమ చేసేవారు. భూముల క్రయవిక్రయాలు జరిగిన సమయంలో సర్‌చార్జి రూపంలో వచ్చిన నిధులు పంచాయతీల జనరల్ ఫండ్ ఖాతాల్లో జమ చేసేవారు. స్టాంప్‌డ్యూటీ నిధులు జిల్లాలో రూ.120 కోట్లకుపైగా విడుదల చేయకుండా తొక్కిపెట్టేశారని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. ఇంటి పన్నుల రూపంలో వసూలైన నగదుతోపాటు, సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ రూపంలో వచ్చిన నిధులు పంచాయతీలకు ఆర్థికంగా కొంతమేర వెన్నుదన్నుగా ఉండేవి. ప్రభుత్వంతో సంబంధం లేకుండా పంచాయతీలే ఈ నిధులను ఏ పనులకు వినియోగించాలో పాలకవర్గాల ద్వారా తీర్మానం చేసి పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు, తాగునీటి వసతి, తాగునీటిని పంపింగ్‌చేసే మోటార్లు, తాగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులు, కనీస పారిశుధ్య చర్యల నిమిత్తం వినియోగించుకునే వెసులుబాటు ఉండేది.

• 12 ఏళ్ల నుంచి పెండింగ్‌లోనే...

సర్‌చార్జి స్టాంప్‌డ్యూటీ రూపంలో పంచాయతీలకు, మండల పరిషత్‌లకు విడుదల చేయాల్సిన నిధులను 2020 డిసెంబరు నుంచి ప్రభుత్వం నిలిపివేసింది. రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఈ నిధులను విడుదల చేయకుండా మిన్నకుండిపోయారు. సర్పంచ్‌లు రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు నిధులు విడుదల చేయడం లేదని చెప్పి పంపేస్తున్నారు. ఆయా పంచాయతీల పరిధిలో జరిగే భూముల క్రయవిక్రయాల సమయంలో పెద్ద పంచాయతీలకు ఏడాదికి కనీసంగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు, చిన్న పంచాయతీలకు కనీసంగా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సర్‌చార్జి స్టాంప్‌డ్యూటీ రూపంలో నిధులు సమకూరేవని సర్పంచ్‌లు, పంచాయతీ ఈవోలు, కార్యదర్శులు చెబుతున్నారు. పంచాయతీలకు ఈ నిధులు అందుబాటులో ఉంటే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర పనులు, పంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కోసం చర్యలు తీసుకోవడానికి ఆవకాశం ఉండేదని సర్పంచ్‌లు అంటున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక కేంద్రప్రభుత్వం విడుదల చేసే 14, 15వ ఆర్థికసంఘం నిధులను పంచాయతీ పాలకవర్గాలకు కనీస సమాచారం ఇవ్వకుండానే మళ్లించేశారని, స్టాంప్ డ్యూటీ నిధులను కూడా విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

ఈ నెలాఖరుకైనా విడుదల చేస్తారా?

మరో పది రోజుల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. మరోవైపు ఎన్నికల హడావుడిలో అన్ని విభాగాల అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతిఏటా మార్చిలో ట్రెజరీల ద్వారా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధిస్తుంది. దీంతో పంచాయతీల నుంచి ట్రెజరీలకు వెళ్లిన బిల్లులు పెండింగ్‌లోనే ఉంటాయి. ఎన్నికల సమయం కూడా కావడంతో పంచాయతీలు, మండల పరిషత్‌లకు సంబంధించిన నిధులను విడుదల చేయించేందుకు ప్రభుత్వం ఎంతమేర చొరవ తీసుకుంటుందనే అంశంపై అనేక అనుమానాలు సర్పంచ్‌లు వ్యక్తం చేస్తున్నారు.

జోగికి ప్రచారం చేసిన పాపం..!

కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శిపై వేటు



కంకిపాడు, మార్చి 20 : అత్యుత్సాహంతో స్వామి భక్తి చూపిస్తున్న ప్రభుత్వ అధికారులపై ఎన్నికల అధికారులు కొరడా ఝులుపిస్తున్నారు. కంకిపాడు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి వల్లభనేని మణికంఠను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెనమలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారంటూ ఈ నిర్ణయం తీసుకుంది. పెనమలూరు మండలంలోని యనమలకుదురు గ్రామంలో మంగళవారం అధికార పార్టీ అభ్యర్థి, మంత్రి జోగి రమేశ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి వల్లభనేని మణికంఠ పాల్గొన్నారు. ఈ విషయం ఫొటోలతో ఆంధ్రజ్యోతి పత్రికలో బుధవారం ప్రచురిత మైంది. దీంతో స్పందించిన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో డి.రాజు... పీఏసీఎస్ కార్యదర్శిని పిలిపించి వివరణ అడిగారు. అంతకు ముందు ఈ వ్యవ హారంపై గుడివాడ సహకార శాఖ అధికారి ఫణికుమార్ విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబును కోరారు. విచారణ అనంతరం మణికంఠ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని నిర్ధారించుకుని, ఆయన్ను సస్పెండ్ చేయాలంటూ కంకిపాడు పీఏసీఎస్ ఛైర్మన్ పద్మావతిని ఆదేశించారు. దీంతో బుధవారం సాయంత్రం సొసైటీ పాలకమండలి కార్యవర్గం సమావేశమై సస్పెండ్ చేస్తూ తీర్మానం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



నాట్య నైవేద్యం

బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర కళావేదికపై బుధవారం ప్రదర్శించిన పలు నాట్యాంశాలు రసజ్ఞులను ఆనందడోలికల్లో ముంచెత్తాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భజనచంద్ర

అధికార పార్టీకి విధేయుడిగా ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి

ఆయనో జిల్లా అధికారి. పార్టీలకతీతంగా పనిచేయాల్సిన ఆయన అధికార పార్టీకి వీర విధేయత చూపిస్తుంటారు. వైసీపీ కండువా కప్పుకొని ఆ పార్టీ కార్యకర్తగా పనిచేస్తుం టారు. ఆయన ఎవరో కాదు ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టీఎస్ జయచంద్ర గాంధీ. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన బంధువు పుల్లారెడ్డికి వీర విధేయత చూపిస్తూ, వైసీపీకి, సీఎం జగన్‌కు వాట్సాప్ గ్రూపుల్లో భజన చేస్తూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

- ఎమ్మెల్యే ఉదయభాను వల్లే తనకు పోస్టింగ్ అంటూ వ్యాఖ్యలు
- ఆ రెండు పత్రికలంటూ వైసీపీ ఏజెంట్‌లా మీడియాపై అక్కసు
- జగ్గయ్యపేట ఎన్నికల అధికారిగా వచ్చేందుకు ప్రయత్నాలు
- టీడీపీ నేతల అభ్యంతరాలతో నిలిచిన నియామకం


డీపీవో టీఎస్ జయచంద్ర గాంధీ



ఆ రెండు పత్రికలంటూ అధికారిక వాట్సాప్ గ్రూపులో డీపీవో పెట్టిన పోస్టు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పంచాయతీల్లోను, సచివాలయాల్లోను వైసీపీ అధినేత జగన్ బొమ్మలు, ఆ పార్టీ రంగులు అలాగే ఉండిపోయాయి. పంచాయతీల్లో వాటర్ ట్యాంకులకు వేసిన వైసీపీ రంగుల విషయంలోనూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం జిల్లా పంచాయతీ అధికారి టీఎస్ జయచంద్ర గాంధీ అనే ఆరోపణలు వస్తు న్నాయి. బుధవారం ఈవోపీఆర్డీల వాట్సాప్ గ్రూపుల్లో ఈయన పెట్టిన మెసేజ్‌లు వివాదాస్పదమయ్యాయి. వైసీపీ అధినేత జగన్ తరహాలో 'ఆ రెండు పత్రికలు' అని సంబోధిస్తూ ఆయన పెట్టిన మెసేజ్‌పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన అధికారి పత్రికల్లో వచ్చే కథనాల్లో నిజాలను నిగ్గు తేల్చాలే తప్ప అక్కసు వెళ్లగక్కడం ఏమిటన్న విమర్శలొస్తున్నాయి.

పోస్టింగ్ వచ్చిన రోజు నుంచి..

జయచంద్ర మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా విధులు నిర్వహించేవారు. ఈయన ఉద్యోగ జీవితం మొత్తం జగ్గయ్య పేట నియోజకవర్గంలోని మండలాల్లో ఎంపీడీవోగా చేయడ ంతోనే గడిచిపోయింది. దీంతో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన బంధువైన పుల్లారెడ్డితో సన్ని హిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఉదయభాను సాయంతోనే జిల్లా పంచాయతీ అధికారిగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈ విషయాన్ని పోస్టింగ్ వచ్చిన రోజే గ్రూపుల్లో మెసేజ్ పెట్టి స్వామిభక్తిని చాటుకున్నారు. ఆయన పెట్టిన మెసేజ్ సారాంశం.. 'జగన్ ప్రభుత్వం ఒక గిరిజనుడిని ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా అవకాశం ఇచ్చింది. నాకు ప్రమోషన్ వచ్చి కేడర్ పెరగడానికి నాకున్న సీనియారిటీ కారణం అయితే, ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా పోస్టింగ్ రావడానికి ముఖ్యంగా సర్దార్ సామినేని ఉదయభాను, మా పెద్దాయన పుల్లారెడ్డి ప్రము ఖంగా కారణం. వీరు ఇరువురు నన్ను నమ్మి నాకు ఈ బాధ్యత ఇచ్చారు. వీరి నమ్మకాన్ని ఎప్పటికీ చెదరనివ్వను.' ఈ మెసేజ్‌పై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. జిల్లాస్థాయి అధికారై ఉండి ఇలా అధికార పార్టీ రాజకీయ నేతలకు భజన చేయడం ఏమిటని విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని జయచంద్రను సున్నితంగా హెచ్చరించారు. అయినా ఆయన తీరు మారలేదు. ఆ తర్వాత కూడా యథావిధిగా అధికార పార్టీ భజన చేస్తూ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టేవారు.

జగ్గయ్యపేట ఎన్నికల అధికారిగానూ ఆయనే..!

ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా పనిచేస్తున్న టీఎస్ జయచంద్రను వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పట్టుబట్టి జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిగా నియమించుకున్నారు. దీనిపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు 14 సంవత్సరాల పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో పనిచేసిన వ్యక్తిని ఎలా ఎన్నికల అధికారిగా నియమిస్తారంటూ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఎన్నికల నియామవళి ప్రకారం ఎవరైనా అధికారికి ఒక నియోజకవర్గంలో ఓటుహక్కు ఉంటే, ఆ నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా పనిచేయడానికి వీల్లేదు. జగ్గయ్యపేట నియోజకవర్గం చిల్లకల్లు గ్రామ పంచాయతీ బూత్ నెంబర్ 77లో సీరియల్ నెంబరు 251, ఎపిక్ నెంబరు డబ్ల్యూసీ0452706తో జయచంద్రకు ఓటు ఉంది. ఆయన ఆధార్‌కార్డు కూడా జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే ఉంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ తాతయ్య లేఖ రాయడంతో ఆయన నియామకం ఆగిపోయింది.


విజయవాడలో ప్రకాశం బ్యారేజీ వద్ద పోలీసులు తనిఖీలు

డిక్కీ తెరుస్తున్నారు

- సరిహద్దుల్లో విస్తృతంగా సోదాలు
- రూ.4.19కోట్లు స్వాధీనం
- 23 లీటర్ల ఎన్‌డీపీఎల్ సీజ్
- రాష్ట్ర సరిహద్దుల్లో 11, జిల్లాల సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు

- 6లో..



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (గురు)
సహర్ (ఉదయం) : 4-51(శుక్ర)





వైసీపీ రంగులు పోలి ఉన్న మోపిదేవి, నాగాయితిప్ప రైతు భరోసా కేంద్రాలు



టిడ్కో కాలనీలో తొలగించని జగన్ స్టిక్కర్లు

అమలుకు నోచని ఎన్నికల నియమావళి!

మోపిదేవి, మార్చి 20 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి షెడ్యూలు విడుదలై రోజులు గడుస్తున్నా గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. మోపిదేవి, వెంకటాపురం, నాగాయితిప్ప, రావివారిపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వైసీపీ గుర్తులతో వేసిన రంగులు యధాతథంగా ఉన్నాయి. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. నాలుగు రోజులు గడిచినా ఎన్నికల నియమావళి అమలు చేయటంలో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు శ్రద్ధ కనబర్చటం లేదని స్థానిక ప్రజలు, పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.



వైసీపీ నేతల బొమ్మలతో తిరుగుతున్న ఆటో

నిబంధనల ఉల్లంఘన..

» రోడ్లపై ఆటోలు తిరుగుతున్నా పట్టని పోలీసు, రవాణా శాఖ అధికారులు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 48 గంటలు గడుస్తున్న అధికారులు ఉదాసీన వైఖరిని వీడటం లేదు. కళ్లెదుటే ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో వైసీపీ సానుభూతిపరుల ఆటోల వెనుక భాగంలో జగన్, స్థానిక నేతల పోస్టర్లతో గత మూడు రోజులుగా దర్జాగా.. పోలీస్ చెక్‌పోస్టులను సైతం దాటుకుంటూ తిరుగుతున్నారు. మల్లాయిపాలెంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద మున్సిపల్ అధికారులు నామమాత్రంగా స్టిక్కర్‌లను తొలగించి చేతులు దులుపుకున్నారు. కాలనీలోని ఇళ్లకు జగన్, కొడాలి నాని స్టిక్కర్‌లు ఇంకా అలానే ఉండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

- గుడివాడ



మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నేతలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

» కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 20 : మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఫిష్ మార్కెట్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి బుధవారం సందర్శించారు. మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. ఈ మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్నారై బొబ్బా గోవర్ధన్‌కు మత్స్యకారుల మద్దతు



నాగాయలంక, మార్చి 20 : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న సదరన్ స్పైసిస్ అధినేత, ప్రవాస భారతీయులు బొబ్బా గోవర్ధన్‌కు నాగాయలంక మండలం మత్స్యకారులు మద్ధతు తెలియజేశారు. టీడీపీ, జనసేన పొత్తుల్లో భాగంగా అవనిగడ్డ సీటును మత్స్యకారులకు అన్నివేళలా అండగా ఉండే గోవర్ధన్‌కు ఇస్తే తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని బుధవారం నాగాయలంకలో మత్స్యకార నేతలు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలియజేశారు. అవనిగడ్డ పాత ఎడ్లంక గ్రామానికి చెందిన బొబ్బా గోవర్ధన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి.. అమెరికాలో సదరన్ స్పైసిస్ పేరుతో వ్యాపారం ప్రారంభించి విస్తరించారు. హైదరాబాద్‌లో బొబ్బా గ్రూప్స్ ఆధ్వర్యంలో స్పైస్ తయారీ కర్మాగారాలను నెలకొల్పి అటు అమెరికాలోనూ, ఇటు భారత్‌లోనూ విజయవంతమైన వ్యాపారిగా పేరుతెచ్చుకున్నారు. రాజకీయాల పట్ల ఆసక్తితో ఇప్పటికే జనసేన పార్టీనేతలతో మంతనాలు ప్రారంభించారు. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల్లో మద్దతు ఉన్న తనకు జనసేన పార్టీ తరపున పోటీచేసే అవకాశం ఇస్తే గెలిచి తీరుతానని ఈ సందర్భంగా బొబ్బా గోవర్ధన్ తెలిపారు.



ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల

వైసీపీ పాలనలో రవాణా రంగం నిర్వీర్యం : వెనిగండ్ల

గుడివాడ, మార్చి 20 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రవాణ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో బుధవారం స్థానిక ప్రజా వేదికలో టీడీపీలో చేరిన యూనియన్ నాయకులకు వెనిగండ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిలకలూరిపేట ప్రజాగళం సభలో ప్రభుత్వ భద్రతా వైఫల్యంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వెనగండ్ల హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ, కొట్టె వెంకట్రావు తదితరులు

బచ్చుల రాజకీయ జీవితం యువతకు ఆదర్శం

» టీడీపీ నేతల నివాళి



మచిలీపట్నం టౌన్, మార్చి 20 : బచ్చుల అర్జునుడు రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, జనసేన నేత బండి రామకృష్ణలు అన్నారు. బుధవారం దివంగత ఎమ్మెల్సీ అర్జునుడు ఇంటి వద్ద సంతాప సభ జరిగింది. సభలో టీడీపీ నేతలు బచ్చుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, క్రమశిక్షణ గల నాయకుడిగా అర్జునుడు అందరి హృదయాలలో చోటు సంపాదించుకున్నారన్నారు. వివిధ పదవుల్లో ఆయన సేవలందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత, చిత్తజల్లు నాగరాము, గుమ్మడి విద్యాసాగర్, జనసేన నాయకులు గడ్డం రాజు, కొట్టె వెంకట్రావు అర్జునుడు కుమారుడు బోసు, కృష్ణామిల్క్ డైరీ యూనియర్ చైర్మన్ చలసాని అంజనేయులు, కొనకళ్ల బుల్లయ్య, అళ్ల వెంకట గోపాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ఉద్యమించాలి

» ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్

చల్లపల్లి, మార్చి 20 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా రైతాంగం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 23న భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, నిరసనలు తెలియజేయాలని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా రైతులు యువజన విద్యార్థి సంఘాలతో కలిసి భగత్ సింగ్‌కు నివాళులర్పించి, కాగడాల ప్రదర్శన ద్వారా కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల నిరసన వ్యక్తం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం ఆర్బీకే సెంటర్లకు తరలించి 62 రోజులైనప్పటికీ నేటి వరకు వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి మల్నీడు ఎలమందరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జి, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పెనుమత్స ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

డిక్కీ తెరుస్తున్నారు

» సరిహద్దుల్లో విస్తృతంగా సోదాలు

» రూ.4.19కోట్లు స్వాధీనం

» 23 లీటర్ల ఎన్‌డీపీఎల్ సీజ్

» రాష్ట్ర సరిహద్దుల్లో 11, జిల్లాల సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఎన్నికల కోడ్ కూయగానే నోట్ల కట్టలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకు రహస్య ప్రదేశాల్లో ఉంచిన లక్ష్మీదేవిని బయటకు తీసుకొస్తున్నారు. ఒకేసారి భారీగా నగదును తరలిస్తే మొత్తానికే ముప్పు వస్తుందని భావించిన నేతలు భాగాలుగా తరలిస్తున్నారు. కోడ్ అమలులోకి రాగానే అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక్కడ జరుగుతున్న తనిఖీలను బట్టి నేతల ఎన్నికల డబ్బుల తరలింపు ప్రారంభమైందని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు మొత్తం రూ.4.19కోట్లను వివిధ వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు నగదుకు సంబంధిత ఎలాంటి బిల్లులను చూపించలేదు.



ఎన్నికల నియమావళిలో భాగంగా నగరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

జిల్లా చుట్టుపక్కల 16 చెక్‌పోస్టులు

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే నగదు, మద్యానికి అడ్డుకట్ట వేయడానికి పోలీసులు మొత్తం 16 చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఎన్టీఆర్ జిల్లాకు తూర్పు వైపున ఏలూరు, కృష్ణా జిల్లా సరిహద్దులు ఉన్నాయి. పశ్చిమ వైపున తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఉంది. జిల్లాలో అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం 16 చెక్‌పోస్టుల వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు. చెక్‌పోస్టుల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను వీరు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా ఇతర జిల్లాల నుంచి చాలా మంది లక్షలాది రూపాయలను వాహనాల్లో తీసుకొస్తున్నారు. సీజ్ చేసిన సమయంలో వ్యాపారం నిమిత్తం ఈ నగదును తీసుకొస్తున్నట్టు సమాధానం చెబుతున్నారు. వాటిని సీఐఎస్ఎఫ్, పోలీసులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దానికి సంబంధించిన ఆధారాలను చూపించాలని అడిగితే మౌనం వహిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.4.19కోట్లకు సంబంధించి నగదుకోసం ఎవరూ ముందుకు రావడం లేదు. వివిధ చెక్‌పోస్టుల వద్ద ఈ నగదును దఫదఫాలుగా సీజ్ చేశారు. ఆధారాలు చూపిస్తే సీజ్ చేసిన మొత్తాన్ని ఇచ్చేస్తామని అధికారులు చెప్పినా.. దానికి సంబంధించిన వ్యక్తులు మాత్రం ముందుకు రాకపోవడం గమనార్హం. ఈ నగదు రాజకీయ నేతలు అనుచరుల ద్వారా రప్పిస్తున్నారా, హవాలా రూపంలో చలామణి అవుతుందా అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

సీసాలు తీసుకుని వాహనాలు ఇచ్చేయండి

రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద పోలీసులకు విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. తెలంగాణ సరిహద్దుల నుంచి వాహనాల్లో ఎన్‌డీపీ లిక్కర్‌ను తీసుకొస్తున్నారు. సరిహద్దుల వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేసినప్పుడు అక్కడే పోలీసులు మద్యం సీసాలతోపాటు వాహనాలను సీజ్ చేస్తున్నారు. సరిహద్దుల నుంచి తప్పించుకున్నా జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద దొరికిపోతున్నారు. ఎన్‌డీపీఎల్ కేసుల్లో వాహనంలో ఉన్న మద్యం సీసాలను, వాహనాలను సీజ్ చేయడంతోపాటు వాటిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తారు. మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినా స్టేషన్ బెయిల్ ఇచ్చేస్తారు. వాహనాల విలువ లక్షల్లో ఉండటంతో నిందితులు వాటిని వదిలిపెట్టాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. తమపై కేసు నమోదు చేసి, సరుకు మొత్తం తీసుకున్నా పర్వాలేదు, కారును మాత్రం సీజ్ చేయకండి అని వెంటపడుతున్నారు. లేనిపక్షంలో రాజకీయ నేతలతో సిఫార్సులు చేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిరంతరం కత్తి వేలాడుతున్నందున పోలీసులు సీజ్ చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపేస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు 23 లీటర్ల ఎన్‌డీపీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వైసీపీ కార్యకర్తల సమావేశంలో వలంటీరు

మచిలీపట్నం టౌన్, మార్చి 20 : ఓ వైపు అధికారులు చర్యలు తీసుకుంటున్నా పలువురు వలంటీర్లు తమ వైఖరి మార్చుకోవడం లేదు. వైసీపీ ఎన్నికల సమావేశాల్లో వలంటీర్లు ఇంకా పాల్గొంటూనే వున్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని గిలకలదిండిలో వున్న పోతురాజు స్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన వైసీపీ నాయకుల కార్యకర్తల సమావేశంలో వాలంటీరు లంకే ఏడుకొండలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వలంటీరు లంకే ఏడుకొండలు బాహాటంగా పాల్గొనడం చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో వివిధ పథకాల ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వలంటీర్లు సమావేశాల్లో వివరిస్తున్నారు.



గిలకలదిండిలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో వలంటీరు (సర్కిల్‌లో)

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గన్నవరం : కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలోని ఇద్దరు వలంటీర్లను తొలగించినట్టు ఎంపీడీవో సత్యకుమార్ బుధవారం తెలిపారు. 'వలంటీర్ల వాడకానికి కొత్త డ్రామా' శీర్షికన ఆంధ్రజ్యోతి ఈ నెల 19వ తేదీన కథనాన్ని ప్రకటించింది. ఆ కథనంలో పేర్కొన్న విధంగా.. ఈ నెల 16వ తేదీ సాయంత్రం వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు నాగార్జున, వంశీ కృష్ణలపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపగా వారి ఆదేశాల మేరకు తొలగించటం జరిగిందని తెలిపారు. ప్రచారంలో పాల్గొన్నది వాస్తవం కావడంతో తొలగించినట్టు ఎంపీడీవో చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలరించిన కూచిపూడి అభినయం



కూచిపూడి, మార్చి 20 : బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళావేదికపై బుధవారం తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపచేశాయి. నాట్యాచార్య సప్పా శివకుమార్ శిష్యురాలు హేమలత శివాష్టకం అంశాన్ని రసరమ్యంగా ప్రదర్శించారు. విశాఖకు చెందిన సత్యభామ శిష్య బృందం త్యాగరాజ కీర్తన, థిల్లానా అంశాలు ప్రదర్శించి మెప్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఓలేటి శ్రీరేఖ శిష్య బృందం శివపార్వతీ లాస్యతాండవం, అమ్మా నీరాజనం అంశాల్లో చూపిన హావభావాలను మంత్రముగ్ధులను గావించాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్, కావూరి భానుమూర్తి, హనుమంతరావు, దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాలను ప్రారంభించారు. కళాకారులకు నిర్వాహకులు మెమెంటోలు అందించి సత్కరించారు.

» నేడు ఇండియా కూటమి నేతల భేటీ

» విజయవాడ సెంట్రల్ సీటు కోరుతున్న సీపీఎం

» వామపక్షాల మధ్య ఇప్పటికే కుదిరిన అవగాహన

» కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది పోటీ



(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇండియా కూటమిలో విజయవాడ సెంట్రల్ స్థానాన్ని కాంగ్రెస్ తీసుకుంటుందా? కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఎంకు కేటాయిస్తుందా? రెండు పార్టీల కార్యకర్తల నుంచి వినిపిస్తున్న ప్రశ్న ఇది. పొత్తులు ఉన్నపుడు సెంట్రల్ నియోజకవర్గాన్ని సీపీఎం తీసుకుంటుంది. 2019 ఎన్నికల్లో జనసేన వామపక్షాలతో కలిసి పొత్తు పెట్టుకోగా సెంట్రల్ సీటును సీపీఎంకు కేటాయించారు. ఇప్పుడు సీపీఎం ఇండియా కూటమిలో భాగస్వామిగా మారింది. దీనితోపాటు సీపీఐ ఉంది. ఈ రెండు పార్టీల్లో దేనికి సెంట్రల్ సీటును కేటాయిస్తారోనన్న సందిగ్ధత ఉంది. ఉమ్మడి జిల్లాలో పోటీ చేయాల్సిన సీట్లపై కూటమి నేతలు గురువారం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే సీపీఎం, సీపీఐల మధ్య ఒక అవగాహన కుదిరింది. విజయవాడ పశ్చిమలో సీపీఐ, సెంట్రల్‌లో సీపీఎం పోటీ చేయాలని భావిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సీపీఐ పశ్చిమ నియోజకవర్గాన్ని, సీపీఎం సెంట్రల్ నియోజకవర్గాన్ని కోరితే కాంగ్రెస్ పార్టీ స్పందన ఎలా ఉంటుందోనన్నది తెలియడం లేదు. ఇప్పటికే సీపీఎం నేత సీహెచ్ బాబూరావు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

సీటు ఎవరిని వరిస్తుందో?

సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు వలిబోయిన గురునాథం కుమారుడు కిరణ్, స్వర ఆసుపత్రి ఎండీ విక్రమ్‌మోహన్, హైకోర్టు న్యాయవాది అనిత దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వలిబోయిన కిరణ్ తండ్రి గురునాథం 2019 ఎన్నికల్లో సెంట్రల్‌లో పోటీ చేశారు. ఈసారి ఆయన తన కుమారుడిని పోటీలో పెట్టాలని భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో కూటమి అభ్యర్థిగా సీపీఎం తరఫున సీహెచ్ బాబూరావు పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి సీపీఎం ఒంటరిగా పోటీ చేసింది. రెండు వామపక్ష పార్టీలో సీపీఎంకు ఎక్కువ బలం ఈ నియోజకవర్గంలో ఉంది. బాబూరావు ప్రస్తుతం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఉన్నారు. సమస్యలపై పోరాటాలు చేసే ఉద్యమ నాయకుడిగా నిరంతరం ప్రజల్లో ఉంటారని ఆయనకు గుర్తింపు ఉంది. సీపీఎం, సీపీఐ మధ్య ఒక అవగాహన కుదరడంతో సీటు సీపీఎంకే దక్కుతుందన్న భావనలో పార్టీ నేతలు ఉన్నారు. విజయవాడ నగరంలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో ఒక సీటును వామపక్షాలకు ఇవ్వాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు సమాచారం. ఈ మూడు నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి భారీగా దరఖాస్తులు అందాయి. పార్టీ ఎన్నికల కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలిస్తోంది. కూటముల్లో సెంట్రల్ నియోజకవర్గాన్ని సీపీఎంకే కేటాయిస్తున్నందున ఈసారి కచ్చితంగా తమకే దక్కుతుందన్న భావనలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఉమ్మడి ఏపీలో సెంట్రల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండుసార్లు విజయం సాధించిందని, ఇక్కడ బలాన్ని పెంచుకోవడానికి తామే పోటీ చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.



విన్నకోటలో వైసీపీ నేత సాయినాథ్ రవికుమార్‌రెడ్డి ఇంటిపై ఉన్న లైటింగ్ బోర్డు

బ్యానర్ల తొలగింపులో వివక్ష!

» టీడీపీ బ్యానరు తొలగించి.. వైసీపీ బ్యానర్ వదిలేశారు

» పంచాయతీ అధికారులను నిలదీసిన నేతలు

గుడ్లవల్లేరు : ఎన్నికల నిబంధనల విషయంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో అధికారులు టీడీపీ లైటింగ్ బోర్డులు, బ్యానర్లను తొలగించారు. వైసీపీ నేతల బోర్డులు అలాగే వదిలేయడంతో టీడీపీ నాయకులు పంచాయతీ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా కొసరాజు మాట్లాడుతూ, గుడ్లవల్లేరులో టీడీపీకి సంబంధించి సైకిల్ గుర్తును లైటింగ్‌తో పార్టీ అభిమాని తన సొంత భవనంపై ఏర్పాటు చేసుకున్నారన్నాడు. అధికార వైసీపీ నాయకులు పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెచ్చి దానిని తొలగించారన్నారు. అయితే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో అధికార పార్టీ నేతలు హోర్డింగులు ఏర్పాటు చేస్తే వాటిని తొలగించకపోవడం శోచనీయమన్నారు. వైసీపీ హోర్డింగులకు అనుమతులున్నాయని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎవరికీ ఎటువంటి అనుమతులు లేవని ఉన్నతాధికారులు చెబుతున్నా స్థానిక అధికారులు పక్షపాత ధోరణితో వైసీపీ ఫ్లెక్సీలను తొలగించకుండా వ్యవహరించడం దారుణమన్నారు. మండలంలోని విన్నకోట గ్రామంలో వైసీపీ మండలాధ్యక్షుడు సాయినాథ్ రవికుమార్‌రెడ్డి ఇంటిపై వైసీపీ లైటింగ్ బోర్డు ఉందని, అధికారులకు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వెంటనే తొలగించకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కొసరాజు తెలిపారు.



నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

పామర్రు, మార్చి 20 : ఎన్నికల నియమావళికి ఏ పార్టీకి ఎలాంటి మినహాయింపు ఉండవని, విధుల్లో ఉన్న అధికార సిబ్బందికి రాజకీయ నేతలు సహకరించాలని ఎన్నికల నోడల్ అధికారిణి ఎం.భారతి కోరారు. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వగ్రామైన నిమ్మకూరులో ప్రవేటు స్థలంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్ర హానికి కూడా ఎటువంటి మినహాయింపు లేదని స్థల యాజమాని పాలడుగు రామప్రసాద్‌కు బుధవారం ఆమె సూచించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొడిగి, శిలాఫలాకంపై నేతల పేర్లు కనిపించకుండా పంచాయతీ సిబ్బంది పేపర్లను అంటించారు.

వైసీపీకి గొడ్డలి గుర్తు కేటాయించాలి

» నాగుల్‌మీరా ఎద్దేవా

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తు రద్దుచేసి గొడ్డలి గుర్తు కేటాయించాలని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా ఎద్దెవా చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సొంత బాబాయిని గొడ్డలితో చంపిన వాళ్ల నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో మొన్న కర్నూలు జిల్లా చాగలమర్రిలో ఇమామ్ హుస్సేన్‌పై వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి చంపారని, నిన్న గిద్దలూరులో గిరిజన యువకుడు మునెయ్యను గొడ్డలితో నరికి చంపేశారన్నారు. అందుకే వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దు చేసి గొడ్డలి గుర్తు కేటాయించాలన్నారు. .

తప్పని 'కోడ్' కష్టాలు!

» వివాహాలకు ఆటంకంగా ఎన్నికల ప్రక్రియ

పామర్రు, మార్చి 20 : ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందంటే ఇదేనేమో.. రాష్ట్రంలో సాధారణ ఎన్నికల ప్రక్రియ శుభకార్యాలు జరుపుకునే వారికి కష్టాలను తెచ్చిపెడుతోంది. కోడ్ అమలుతో పెళ్లిపనులు చేసుకునేవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్‌మాసంలో ఎక్కువగా ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయి. నగదు లావాదేవీలు చేయలేక సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో షామియానాలు, వంటసామాగ్రి దొరికే పరిస్థితి లేక సతమతమవుతున్నారు. నగదు రవాణాపై ఆంక్షలు ఉండడంతో టెన్షన్ పడుతున్నారు.

27న 'ఆక్వా వ్యవస్థాపకత, సాధికారత'పై సెమినార్

మొగల్రాజపురం, మార్చి 20 : ఈ నెల 27న మహాత్మాగాంధీ రోడ్డు హోటల్ వివాంతలో 'ఆక్వాపరిశ్రమలో వ్యవస్థాపకత, సాధికారత' అంశం మీద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ చైర్మన్ మలినేని రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు 9840 77227 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు


మాట్లాడుతున్న రాములునాయక్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 20 : క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సమగ్ర శిక్ష జిల్లా కో- ఆర్డినేటర్ కె.రాములునాయక్ అనాథ విద్యార్థులకు సూచించారు. వేలేరులోని అమ్మఅనాథ ఆశ్రమం హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యాలయ తరగతి గదులను, విద్యాబోధన, హాస్టల్‌ను అధికారులు రాంబాబు, నగేష్, రామకృష్ణ, ఎంఈవో రాంబాలాసింగ్, సురేష్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్

ఉయ్యూరు, మార్చి 20 : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఉయ్యూరు పట్టణ సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, సిబ్బంది స్టాటిక్ సర్వేలియాన్స్ టీమ్-3 ఇన్‌చార్జ్ ఎం వెంకటేశ్వరరావుతో కలసి కాటూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డుపై వెళ తున్న కార్లు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

పెనమలూరు టీడీపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలి

కంకిపాడు, మార్చి 20 : పెనమలూరు నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కేటాయించని పక్షంలో ఆ సీటును తనకు కేటాయించాలని బీసీ సంఘం జిల్లా నాయకుడు సాయిరాం ప్రసాద్‌గౌడ్ చంద్రబాబును కోరనున్నట్టు తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టికెట్‌ను బీసీలకు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని, నియోజకవర్గంలో లక్షకుపైగా బీసీ ఓటర్లు ఉన్నారని, అధికార పార్టీకి చెందిన బీసీ అభ్యర్థిని ఢీ కొట్టాలంటే తెలుగుదేశం పార్టీ తనకు టికెట్ కేటాయించాలని చంద్రబాబును కోరనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

గోసాల (కంకిపాడు), మార్చి 20 : పౌష్టికాహారంపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని సూపర్‌వైజర్ కె. శ్రీలత అన్నారు. గోసాలలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ, చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు అధికశాతం వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ


యార్లగడ్డ వెంకట్రావును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీలో చేరిన ఎ.సీతారాంపురం సర్పంచ్ గణేష్

ఉంగుటూరు/ హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 20 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఏర్పడే ఉమ్మడి ప్రభుత్వంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, కూటమి బలపరచిన గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని తేలప్రోలు, ఏ.సీతారాంపురంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారధి హాజరయ్యారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో టీడీపీ శ్రేణులతో పాటు జనసైనికులు, బీజేపీ శ్రేణులు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, గడపగడపకు శంఖారావం ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన 100మంది యువత వైసీపీనుంచి టీడీపీలోకి చేరగా యార్లగడ్డ వెంకట్రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, నాయకులు దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికళ్యాణి, గులిపల్లి సందీప్, నిమ్మకూరి మహేష్, గుడ్డేటి శ్యామ్, కుందేటి చంద్రశేఖర్, కొసరాజు సాయి, మేడేపల్లి రమ, కోనేరు సందీప్, మండవ రమ్యకృష్ణ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిక్కవరం ఆర్‌బీకే సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ధాన్యం బిల్లులు చెల్లించాలి

గన్నవరం, మార్చి 20 : ధాన్యం నగదు రైతులకు వెంటనే చెల్లించాలని కౌలురైతు సంఘం జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చిక్కవరం ఆర్‌బీకే సెంటర్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మూడు నెలలు గడుస్తున్నా ధాన్యం అమ్మిన రైతులకు బిల్లులు పడకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంతో రైతులు నానా ఇబ్బందులు పడుతు న్నారని, అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. నాయకులు కైలే ఏసుదాసు, నల్లూరి ధర్మారావు, సూరగాని సాంబశివరావు, మల్లంపల్లి ఆంజనేయులు, రైతులు జొన్నలగడ్డ రంగారావు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

పెనమలూరు, మార్చి 20 : ఫంక్షన్‌కు వచ్చి బంగారం కోల్పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు జగనన్న కాలనీకి చెందిన చేకూరి సాయిదీప్తి తన కుటుంబంతో కలిసి యనమలకుదురులోని ఒక ఫంక్షన్‌కు వచ్చి తనకు చెందిన ఏడు కాసుల బంగారాన్ని ఒక బాక్సులో పెట్టి గదిలో ఉంచింది. కాసేపయిన తర్వాత వెళ్లి చూసేసరికి బంగారం కనిపించక పోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. మేకప్ ఉమన్‌పై తమకు అనుమానం ఉందంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్


అన్నం వడ్డిస్తున్న బోడె వెంకట్రామ్, యెనిగళ్ల, దండమూడి చౌదరి

ఉయ్యూరు, మార్చి 20 : పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఎన్టీఆర్ ఆశయాన్ని అమలు చేస్తూ, అన్న క్యాంటీన్ ప్రారంభించి వంద రోజులుగా పేదల ఆకలి తీర్చుతున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అభినందనీయుడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు అన్నారు. దండమూడి చౌదరి, స్నేహితుల సహకారంతో ఉయ్యూరులో అన్న క్యాంటీన్ ప్రారంభించి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో కలసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. స్నేహితుల సహకారం, డీజేఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేదల ఉపాధికి తోపుడు బండ్లు, బడ్డీలు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తూ, అన్నక్యాంటీన్ ద్వారా రూ. 5లకే అన్నం పెడుతున్నామని దండమూడి చౌదరి పేర్కొన్నారు. పార్టీ నాయకులు జంపాన గుర్నాధరావు, పలియాల శ్రీనివాసరావు, పరిమి భాస్కర్, అప్పలనాయుడు, యుగబాబు, సుబ్బారావు, అంజిబాబు, రఫీ పాల్గొన్నారు.

భువనమ్మను అవమానించిన నాని, వంశీని శత్రువులుగానే భావించా

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 20 : నారా భువనమ్మను అవమానకరంగా మాట్లాడిన కొడాలి నాని, వంశీలను నేనెప్పుడూ శత్రువులుగానే భావించానని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం యనమలకుదురు కాల్వ కట్టమీద 17వ డివిజన్లో జరిగిన పాదయాత్ర సందర్భంగా బోడె స్థానికులతో మాట్లాడుతూ, కొంత మంది పనికిమాలిన వెధవలు, పార్టీకి కించిత్తు కూడా ఉపయోగపడని సన్నాసులు పనికట్టుకొని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, భువనమ్మను అవమానించిన వ్యక్తులు తనకు ఎలా మిత్రులవుతారని ప్రశ్నించారు. వారి ప్రచారాన్ని టీడీపీ నమ్ముతుందని తాను అనుకోవడం లేదన్నారు. మసిగుడ్డను మొహం మీద వేసి తుడుచుకోమన్న చందంగా వారి ప్రచారం ఉందని ఎద్దేవా చేశారు. తన గురించి, తన కుటుంబం గురించి టీడీపీ శ్రేణులకు తెలుసన్నారు. బోడె వెంట భార్య హేమ, కుమారుడు వెంకట్రామ్, కుమార్తె వైష్ణవి తదితరులు ఉన్నారు.


యనమలకుదురులో పాదయాత్ర చేస్తున్న బోడె ప్రసాద్, తదితరులు

కనుల పండువగా విజయ గణపతి దేవాలయ ప్రతిష్ఠ


విగ్రహాలకు పూజలు, అభిషేకాలు చేస్తున్న పండితులు

వీరవల్లి మొఖాస(ఉయ్యూరు), మార్చి 20 : కడవకొల్లు పంచాయతీ పరిధి వీరవల్లి మొఖాసలో శ్రీవిజయగణపతి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రాంబాబు, బసవరాజ్యం, గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మూడోరోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వాచనం తదుపరి శ్రీవిజయ గణపతి సహిత, ఆంజనేయ, గోపాలకృష్ణ, కోదండరామ, హయగ్రీవ వెంకటేశ్వరస్వామి యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన, తదుపరి విగ్రహ ప్రాణ పతిష్ఠాపన చేశారు. కుంబాభిషేకం, శాంతి కళ్యాణం, మహాదాశీర్వచనం నేత్ర పర్వంగా చేశారు. టీడీపీ నాయకులు కేపీ సారథి, వర్ల కుమార్‌రాజా, తుమ్మల బుడ్డియ్య, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ తాతా సురేశ్‌బాబు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కడవకొల్లు, పరిసర గ్రామల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన చేశారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

పెనమలూరు : కానూరు వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నే సుజాత వేణుగోపాలకృష్ణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో ఆరువేల మందికిపైగా భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

తిరుపతమ్మ, గోపయ్యస్వామి కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లిలో తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య 8మంది దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం, ప్రభల ఊరేగింపు నిర్వహించారు.

సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్ : స్థానిక లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏకాదశిని పురస్కరించుకొని సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వ్రత కార్యక్రమాన్ని జరిపారు. కార్యక్రమంలో ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, ఆలయ సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 20 : జాతీయ రహదారిపై ఎస్.ఎన్. పాలెం పంచాయతీ పరిధిలోని పెట్రోల్‌బంకు సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో గుర్తుతెలి యని వ్యక్తి మృతి చెందాడు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం ఉదయం రోడ్డు దాటు తున్న వ్యక్తిని ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వెలుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల దర్యాప్తు చేసినా ఫలితం లేకపోవడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చిరంజీవి వివరించారు.

రైలు నుంచి జారిపడి..

ఉంగుటూరు : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘ టన మండలంలోని తేలప్రోలు రైల్వేస్టేషన్ గేటు సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రైల్వేస్టేషన్ పరిధిలోని తేలప్రోలు రైల్వేస్టేషన్ గేటు సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందాడు. గమనించిన కీమాన్ విష యాన్ని స్టేషన్ మాస్టర్‌కు తెలపగా ఆయన ఏలూరు రైల్వే పోలీసులకు సమాచార మిచ్చారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ, రైల్వే పోలీస్ విజయ్ చంద్ర, ఆర్‌పీఎఫ్ ఏఎస్సై రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పట్టాల పక్కన పడివున్న మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 20 : ఎన్నికల నియమావళి ఉల్లఘిం చిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని రంగన్నగూడెం ప్రజాప్రతినిధులు కోరారు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శిపై గానీ అధికారపార్టీ నాయకులపై గానీ క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా బదిలీచేసి సరిపెట్టడంతో రంగన్నగూడెం ప్రజాప్రతినిధులు బుధవా రం ఆవేదన వ్యక్తం చేశారు. రంగన్న గూడెంలో పంచాయతీ కార్యదర్శి ఆలా కళ్యాణి సహకారంతో వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత సింగన్న గూడెంలో రహదారి అభివృద్ధి పనులు మొదలు పెట్టారని సర్పంచ్ కనుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీ నారాయణ, ఉప సర్పంచ్ బెజవాడ వెంక టకృష్ణారావు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్ష నిర్వహించిన గన్నవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలిశర్మ కార్యదర్శి ఆలా కళ్యాణిని వేరొక గ్రామానికి బదిలీ చేయాలని నివేదిక సమర్పించారు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

గన్నవరం, మార్చి 20 : తిరుపతమ్మ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు. పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఎదుట అమ్మవారి మండపం నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రూ. 40 లక్షలతో నిర్మించే మండప శంకుస్థాపనలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాల వర్ధనరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, పడమట రంగారావు, కాసనేని గోపాలరావు, అరవపల్లి బోసు, జాస్తి నాగేశ్వరరావు, మండవ ప్రభాకరరావు, జాస్తి వెంకట కృష్ణారావు, కాసనేని రంగబాబు, జాస్తి ఫణిశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మండప నిర్మాణానికి అమెరికాకు చెందిన గుట్టుముక్కల భానుదేవ వర్మ, సుష్మా చౌదరి దంపతులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. జాస్తి శ్రీనివాస్ ప్రసాద్ దంపతులు రూ. 50 వేలు, బాయిన సాంబశివరావు, విజయలక్ష్మి దంపతులు రూ. లక్ష విరాళం ఆలయ కమిటీకి అందజేశారు.

యార్లగడ్డ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

హనుమాన్‌జంక్షన్: గన్నవరం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శాయశక్తుల కృషి చేయాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం రాత్రి బాపులపాడులో గడపగడపకు నిర్వహిస్తున్న శంఖారావం కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు అట్లూరి శ్రీని వాసరావు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, వడ్డిల్లి లక్ష్మి గార్లపాటి రాజేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగి కోటమ్మకు మెమో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడివాడ: 'వైసీపీ కార్యక్రమాల్లో మున్సిపల్ ఉద్యోగి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.కృష్ణారావు స్పందించారు. మునిసిపల్ ఉద్యోగి కోటమ్మకు ఆయన మెమో జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఈనెల 18న వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ 3వ వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగి బొజ్జగాని కోటమ్మ పాల్గొన్నారని ఆంధ్రజ్యోతి కథనంలో పేర్కొంది. కాగా, ఎన్నికల కమిషన్ చర్యల నుంచి తప్పించుకునేందుకు కోటమ్మ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సస్పెన్షన్ వేటు తప్పించుకునేందుకు ఎన్నికల అధికారులపై వైసీపీ నాయకులతో ఒత్తిడి చేయిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. రెండేళ్లక్రితం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోను తాజాగా పాల్గొన్నట్లు తానంటే గిట్టని వాళ్లు చూపించారని మున్సిపల్ అధికారులకు కోటమ్మ వివరణ ఇచ్చారని సమాచారం.



విన్నకోటలో వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, జనసేన, బీజేపీ నాయకులకు గజమాల వేస్తున్న కార్యకర్తలు





టీడీపీ-జనసేన-బీజేపీ కార్యాచరణ సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర, చేవేంద్రలో యువకుడితో మాట్లాడుతున్న కాగిత కృష్ణప్రసాద్

మోసపూరిత వాగ్దానాలు చేసే నాయకులను ఓడిద్దాం

● ప్రజలకు వెనిగండ్ల రాము పిలుపు

గుడ్లవల్లేరు, మార్చి 20: "అధ్వానంగా ఉన్న గుడ్లవల్లేరు-విన్నకోట ప్రధాన రహదారిని చూస్తే గుడివాడ నియోజకవర్గ అభివృద్ధి తెలుస్తుంది. ఎన్నికలకు ముందు వచ్చి రోడ్డు వేసేస్తున్నాం.. డబుల్ లైన్ వేసేస్తాం అని మోసపూరిత వాగ్దానాలు చేసే నాయకులను వచ్చే ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాల్సిన తరుణం ఆసన్నమైంది." అని టీడీపీ-జనసేన-బీజేపీ గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం విన్నకోటలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలు విన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలు తీరుస్తామని వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎన్టీఆర్ సుజలధార పథకం వద్ద రాము సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఎన్టీఆర్ పేరుందనే దీన్ని నిరుపయోగం చేశారని ఆరోపించారు. విన్నకోటలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు గజమాలలు వేసి ప్రజలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. టీడీపీ నాయకులు కొనరాజు బాపయ్యచౌదరి, కొడాలి రామరాజు, అడుసుమిల్లి రామ్మోహనరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, పాలేటి ఆంజనేయిలు, కోటప్రోలు ఆంజనేయులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, సీఎల్ వెంకట్రావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో వెనిగండ్ల, షరీఫ్

గుడివాడ రూరల్: నియోజకవర్గ ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో వెనిగండ్ల రాము, శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్.ఫిరోజ్, ఎంఎస్ బేగ్, మహ్మద్ హమద్ ఉల్లా, పిన్నమనేని వెంకటేశ్వరరావు, గోర్జి సత్యనారాయణ పాల్గొన్నారు.



విందుకు విచ్చేసిన ముస్లింలతో వెనిగండ్ల రాము, షరీఫ్, రావి, పిన్నమనేని

నియంత పాలనకు స్వస్తి పలుకుదాం

టీడీపీ-జనసేన-బీజేపీ కార్యాచరణ సమావేశంలో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 20: అవినీతి, అక్రమాలు, కక్షసాధింపు చర్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగన్‌రెడ్డి నియంతపాలనకు స్వస్తి పలికేందుకు ఉమ్మడి పోరాటం చేద్దామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. బుధవారం ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక కోసం నిర్వహించిన కూటమి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మట్టి, ఇసుక దోపిడీతో కోట్లాది రూపాయల మట్టి, ఇసుక దోపిడీ జరిగిందన్నారు. వైసీపీ పాలనకు విసిగిపోయిన ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ఓటమి భయంతోనే పేర్ని నాని పోటీ చేయకుండా తన కుమారుడిని రంగంలోకి దించారని బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాల, హార్బర్ అభివృద్ధిని వైసీపీ నాయకులు తాము చేసిన అభివృద్ధి పనులుగా గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే మచిలీపట్నంలో జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జరిగాయన్నారు. ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికతో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు పార్టీల నాయకులు కలిసి పనిచేద్దామని, ఇందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసుకుందామని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, బందరు రూరల్ మండల అధ్యక్షుడు గల్లా తిమోతి సూచించారు. టీడీపీ నాయకులు కుంచే నాని, ఎండీ ఇలియాస్ పాషా, మోటమర్రి బాబా ప్రసాద్‌లు కొల్లు రవీంద్ర విజయానికి రూపొందించాల్సిన ప్రణాళికలపై మాట్లాడారు. కొట్టె వెంకట్రావు, పల్లపాటి సుబ్రహ్మణ్యం, లంకే శేషగిరిరావు, కరెడ్ల సుశీల, కాగిత వెంకటేశ్వరరావు, తలారి సోమశేఖర్, కె.సత్యనారాయణ, పి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పండి: కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్: "వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసింది. వచ్చేఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చి జగన్‌కు తగిన బుద్ధి చెప్పండి." అని ప్రజలను కూటమి మచిలీపట్నం నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర కోరారు. బుట్టాయిపేటలో బుధవారం రాత్రి జనసేన నాయకుడు మాదివాడ రాముతో కలిసి ఆయన పర్యటించారు. కూటమి అభ్యర్థులను గెలిపించమని ప్రజలను కోరారు. మరకాని వాసు, గోకుల శివ, ఇలియాస్ పాషా, అనిత, ఖాజా, ఇలియాస్ పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టిందీ ప్రభుత్వం: కాగిత

పెడన రూరల్: వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని వదిలిపెట్టి, సంక్షేమంతోనే పాలన సాగిస్తూ ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టడం భవిష్యత్ తరాలకు గొడ్డలిపెట్టని టీడీపీ-జనసేన-బీజేపీ పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. చేవేంద్రలో ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. చంద్రబాబు పాలనలో ఉమ్మడి రాష్ట్రం అభివృద్ధి చెందిందని, మళ్లీ సీఎంగా చంద్రబాబు అయితేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, సాదరబోయిన ఏడుకొండలు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, అంకెం పైడేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జయంతి వేడుకలు నిర్వహించారు. గూడూరు మండలం రామరాజుపాలెంలో కృష్ణప్రసాద్ భార్య శిరీష ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అరాచకపు పాలనతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారని, కూటమి అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలన్నీ పటాపంచలవుతాయని ప్రజలకు వివరించారు.

దళిత సంఘాలన్నీ ఏకమవ్వాలి: మాచవరపు ఆదినారాయణ

మచిలీపట్నం టౌన్: మోసపు హామీలతో దళితుల ఓట్లను కొల్లగొట్టిన జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో దళిత సంఘాలన్నీ ఏకమై బుద్ధి చెప్పాలని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ కోరారు. టీడీపీ మచిలీపట్నం పార్లమెంటు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ కూటమికి కూటమికి సంఘీబావం తెలిపారన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టి.గంగాధర్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యక్రమాల్లో వలంటీర్లు, మున్సిపల్ ఉద్యోగులు

● అయినా వారిపై చర్యలేవీ?: దింట్యాల

గుడివాడ: "ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. నియోజకవర్గంలో వలంటీర్లు, మున్సిపల్ ఉద్యోగులు బహిరంగంగా వైసీపీ కార్యక్రమాల్లో, నాయకుల వెంట తిరుగుతున్నారు. పార్టీ కోసం ప్రచారం చేస్తున్నారు. అయినా వారిపై చర్యలు తీసుకోవడం లేదు." అని టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు ఆరోపించారు. బుధవారం ప్రజావేదికలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు గుడివాడలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారు. వైసీపీ ఫ్లెక్సీలు, స్టిక్కర్లు తొలగించకుండా తాత్సారం చేస్తున్నారు. టీడీపీవి తొలగించడంలో ఉత్సాహం చూపుతున్నారు. పేదలకు పంచిన తోపుడు బండ్లకు నలుపు రంగులు వేస్తున్నారు. ఇది దారుణం. టిడ్కో కాలనీలో వేలాది ఇళ్లపై జగన్, కొడాలి నాని స్టిక్కర్‌లున్నా వాటిని తొలగించలేదు. మున్సిపల్ ఉద్యోగి బొజ్జగాని కోటమ్మ, వలంటీర్లు కోడ్ వచ్చిన తర్వాత కూడా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం." అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న గుడివాడ ఆర్డీవో చర్యలు తీసుకోవాలని దింట్యాల డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



కోడ్ ఉల్లంఘనపై ఆర్వో సుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

ఈవోపీఆర్డీపై చర్యలు తీసుకోండి

అవనిగడ్డ, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశాలు పెట్టి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న అవనిగడ్డ ఈవోపీఆర్డీ శైలజాకుమారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు బుధవారం ఆర్వో బాలసుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేశారు. "మండలంలో ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు అందుతాయని ఈవోపీఆర్డీ ప్రచారం చేస్తున్నారు. ఇళ్ల పట్టాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటో ఉంది. వెంటనే పంపిణీ చేయగా మిగిలిపోయిన ఇళ్ల పట్టాలు స్వాధీనం చేసుకోండి. సిబ్బందితో ఈ పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసు కోండి." అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, లుక్కా వెంకటపిచ్చియ్య, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజయ్, యలవర్తి చిన్నా పాల్గొన్నారు.

కోడ్ అమలవుతున్నా జగనన్న పేరుతో వైద్య శిబిరాలా?

మచిలీపట్నం టౌన్: ఎన్నికల కోడ్ రాకమునుపు జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి వైసీపీ నాయకులు పార్టీ ప్రచారం చేసుకున్నారు. కోడ్ అమల్లో ఉన్నా వైద్యశిబిరాల పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇది సబబు కాదు." అని టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలో వైద్య సేవలు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉన్నా, మందులు ఇవ్వకుండా శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.

ప్రజా సేవకుడు కాగిత వెంకట్రావు

పెడన, మార్చి 20: ఎమ్మెల్యేగా, చీఫ్‌విప్‌గా, టీటీడీ బోర్డు చైర్మన్‌గా, పీయూసీ చైర్మన్‌గా నిరుపమాన సేవలందించిన ప్రజా సేవకుడు కాగిత వెంకట్రావు అని బీసీ సంక్షేమ సంఘ నాయకులు ప్రశంసించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సంఘ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జయంతిని నిర్వహించారు. వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కుక్కల సత్యనారాయణ, బొర్రా కాశీ, వీరంకి శ్రీనివాసరావు, గూడవల్లి కృష్ణార్జునరావు, కాగిత శంకర సాంబశివరావు, పామర్తి వెంకటేశ్వరరావు, కాగిత వాసు పాల్గొన్నారు.



కాగిత వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

బంటుమిల్లి: టీడీపీ మండల కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో కాగిత వెంకట్రావు జయంతి వేడుకలు మండలంలో నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. రోగులకు పండ్లు పంచారు. సింగంశెట్టి శ్రీనివాసరావు, ధనశ్రీరామ్మూర్తి, సన్నాల ప్రసాద్ పాల్గొన్నారు.

బీరువాలో భద్రపరిచిన నగలు, నగదు చోరీ

పెడన, మార్చి 20: బీరువాలో భద్రపరిచిన నగలు, నగదు చోరీ అయ్యాయని ఇంటి యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ తెలిపారు. 4వ వార్డులో నివాసం ఉంటున్న రజియాసుల్తానా తన ఇంట్లోని బీరువాలో రూ.6 లక్షల విలువైన బంగారు నగలు, రూ. 10వేల ఉంచానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదు రోజుల క్రితం ఆమె బీరువాను తెరిచి చూడగా నగలు, నగదు బీరువాలోనే ఉన్నాయి. మంగళవారం రాత్రి ఆమె మరోసారి బీరువా తెరిచి చూడగా బీరువాలో ఉండాల్సిన నగలు, నగదు కనిపించలేదు. రజియా సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేశారని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సంగమేశ్వరం దాడి ఘటనలో.. నిందితులపై చర్యలు తీసుకోవాలి

నాగాయలంక, మార్చి 20: సంగమేశ్వరంలో నాయుడు శివరామకయ్యృష్ణ, అతని కుటుంబంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గాయాలపాలైన బాధితుడిని, ఆ కుటుంబాన్ని బుధవారం వారు నాగాయలంకలోని ఇంటి వద్ద పరామర్శించారు. నిందితులు శివరామకృష్ణ, అతని కుటుంబాన్ని చంపాలనే రాడ్లు, కర్రలు, బ్లేడ్లతో విచక్షణరహితంగా దాడి చేశారని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లారు. సంఘ నేతలు నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని స్టేషన్ ఎదుట బ్యానర్‌తో నిరసన తెలిపారు. మెడికల్ రిపోర్టు ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్, అగ్నికుల క్షత్రియ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకులు ఒడుగు శ్రీకాంత్, కుల నిర్మూల పోరాట సమితి నాయకులు చార్లెస్, కోలా బాజీ, సీనియర్ మత్స్యకార నాయకులు చెన్ను గురుమూర్తి, మౌలాలి, కోలా సాంబయ్య, రామాను సుబ్బయ్య, కొక్కిలిగడ్డ భిక్షం, కోలా సాయి పాల్గొన్నారు.



నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

విశ్వనాథపల్లి నాంచారమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

కోడూరు, మార్చి 20: విశ్వనాథపల్లిలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించే అద్దంకి నాంచారమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, మంచినీటి సరఫరా ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కృష్ణానది తీరాన భక్తులు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అవనిగడ్డ సీఐ త్రినాథ్, కోడూరు ఎండీవో ఆర్.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ నాగరేవతి, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచ్ కొప్పనాతి శేషుబాబు, ఎస్‌ఐ పి.శిరీష, ఆలయ ఈవో సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కులగణన నివేదిక బహిర్గతం చేయాలి

● కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ డిమాండ్

మచిలీపట్నం టౌన్, మార్చి 20: రాష్ట్రంలో కులగణన నివేదికలు పూర్తయ్యాయని, వాటిని వెంటనే బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ నియోజకవర్గంలో ఏ కులాల వారు అధికంగా ఉన్నారో సమాచారం రాష్ట్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉందని, దీన్ని అనుసరించి ఎన్నికల సమయంలో ప్రచార సభలు జరిపేందుకు వైసీపీ వ్యూహం పన్నుతోందన్నారు. తమ పదవులు కాపాడుకునేందుకు వైసీపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ప్రత్యేకహోదా కోసం ఒత్తిడి తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో ఎన్నికల బరిలో దిగుతామన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ వంటి ముస్లింల వ్యతిరేక చట్టాలను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. మణిపూర్‌లో క్రిస్టియన్ మైనారిటీలపై దాడులు జరిగిన సందర్భాల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా కోసం పోరాడుతోందన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ మతీన్, జిల్లా అధికార ప్రతినిధి దీపిక, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, రజియా సుల్తానా, నాగరాజు, చిలుకోటి ప్రసాద్, మహమ్మద్ ఆరీఫ్ గౌస్, మొహిద్దీన్ హైదర్, అక్బర్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

గుంటుపల్లి మృతి టీడీపీకి తీరనిలోటు

పామర్రు, మార్చి 20: నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు, టీడీపీ క్రమశిక్షణ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ-జనసేన-బీజేపీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో నాగేశ్వరరావు చిత్రపటానికి బుధవారం పార్టీ నేతలతో కలిసి కుమార్‌రాజా నివాళులర్పించారు. దాలిపర్తి ప్రసాద్, అశోక్‌కుమార్, గోపాలకృష్ణ హరిబాబు, సురేష్ పాల్గొన్నారు.



గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వర్ల కుమార్‌రాజా



ఆలయానికి వెండి మండపాన్ని తీసుకొస్తున్న భక్తులు

సుబ్బారాయుడికి వెండి మండపం వితరణ

నాగాయలంక, మార్చి 20: వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విశ్రాంత ఉద్యోగి, దాత వడ్లమూడి సీతారామయ్య రూ.3 లక్షల విలువైన వెండి మండపాన్ని బుధవారం వితరణగా అందించారు. దాత ఇంటి నుంచి ఎడ్లబండిపై ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ఆలయ అర్చకుడు కనకాల కుటుంబరావు, నిర్వాహకులు పొన్నంపల్లి చిన్న ద్వారా సీతారామయ్య కుటుంబసభ్యులు మండపాన్ని అందించారు.

నియమావళిని అనుసరించి జాతర జరుపుకోండి

మోపిదేవి, మార్చి 20: పెదప్రోలులో ఈనెల 25వ తేదీన నిర్వహించే అద్దంకి నాంచారమ్మ జాతరను ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జరుపుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ సూచించారు. అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకుని గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులతో బుధవారం ఆయన కమిటీ సమావేశం నిర్వహించారు. జాతరలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రదర్శిస్తే ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లేనన్నారు. గ్రామస్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులు సహకరించాలని ఆయన కోరారు. ఎస్సైలు చినబాబు, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు గురుప్రసాద్, కె.వి.ఎస్.కె. కోటేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుడివాడ: వర్ల బజారులోని పాత ఇండియన్ గ్యాస్ కంపెనీ సమీపంలోని తుంపూడి నాగవెంకట సాంబశివరావు గృహంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వృద్ధుల సంక్షేమ సంఘం 5వ సర్వసభ సమావేశాన్ని బుధవారం సంఘ ఉపాధ్యక్షుడు తిరుపతయ్య అధ్యక్షతన నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులుగా పెద్దిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడిగా తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నం గంగాధరరావు, ఉపాధ్యక్షులుగా దండమూడి సీతారామయ్య, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ హన్ను, కోశాధికారిగా బొమ్మదేవర సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీత నాగేశ్వరరావు, సభ్యులుగా తుంపూడి సాంబశివరావు, కోనా వజ్రాలు ఎన్నికయ్యారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు

మచిలీపట్నం టౌన్, మార్చి 20 : మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బుధవారం టీడీపీ లీగల్ సెల్ నాయకుడు మాదివాడ నరసింహారావు, జనసేన సానుభూతిపరుడు బూరగడ్డ అశోక్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాది వింజమూరి శివరాం ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యక్ష పదవికి కె.నాగాంజనేయులు, ప్రధాన కార్యదర్శికి ఎస్.ఎస్.ఎస్. సాయిబాబు, కార్యదర్శికి పి.రూపారాణి, లైబ్రరీ సెక్రటరీకి సర్వా లలితకుమారి, కోశాధికారికి ఎ.నిరంజన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్‌కు వసుమర్తి సూర్యప్రకాష్, కార్యవర్గ సభ్యులకు బి.వెంకటేశ్వరరావు, పి.ప్రవీణ్‌కుమార్, అర్జా శ్యామ్‌ప్రకాష్, జి.వి.రమణమ్మ, వి.రాధాకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పదవులకు సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో ఈ పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. గురువారం అధ్యక్ష పదవికి పోటీచేసిన వారు ఉపసంహరించుకునే అవకాశం ఉందని ఎన్నికల అధికారి శివరాం తెలిపారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గుడివాడ రూరల్: బిళ్లపాడులో రెండు రోజుల క్రితం విద్యుదాఘాతంతో పడమట కనకదుర్గ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బుధవారం పట్టణ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు నిత్యావసర వస్తువులను ఆమెకు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భవిరి శంకరనాథ్, మడక ప్రసాద్, కె.అనురాధ, పావని, ఆర్కే పాల్గొన్నారు.

అర్చకుడి కుటుంబానికి బుద్ధప్రసాద్ పరామర్శ

మోపిదేవి, మార్చి 20: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడిగా పనిచేస్తున్న బుద్దు సతీష్ కుటుంబసభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ బుధవారం పరామర్శించారు. అర్చకుడు సతీష్ కుమారుడు విజయ్‌కార్తీక్ తీవ్ర అస్వస్థతతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బుద్ధప్రసాద్ మోపిదేవి విచ్చేసి సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు ఉన్నారు.